క్లుప్తంగా

రేపు బౌద్ధం అవసరంపై ఉపన్యాసం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నేటి పరిస్థితుల్లో బౌద్ధం అవసరం అనే అంశంపై ఆదివారం గుంటూరుకు చెందిన బొర్రా గోవర్ధన్ ఉపన్యాసం నిర్వహించనున్నట్లు బౌద్ధ దమ్మ సంఘ సభ్యులు తెలిపారు. చిత్తూరు నగరం పీవీకేఎన్ కళాశాల సమీపంలోని మ్యాంగోభవనంలో ఉదయం 10.30 గంటలకు ఈ ఉపన్యాసం ఉంటుందన్నారు. సాహితీ ప్రియులు హాజరు కావాలని వారు కోరారు.

కాణిపాకంలో కాకినాడ కలెక్టర్



స్వామి సేవలో కలెక్టర్ సగిలి షణ్మోహన్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం కాకినాడ కలెక్టర్ సగిలి షణ్మోహన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేసి స్వామి తీర్థ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు వాసు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక

తవణంపల్లె: మండల ఎంఆర్‌పీఎస్ కమిటీలు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులుగా జయచంద్ర మాదిగ, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్‌మాదిగ, కోశాధికారిగా శ్రీనివాసులుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు అనిల్‌కుమార్ మాదిగ, కిరణ్ మాదిగ, గోపాల్ మాదిగ తెలిపారు.

ఇష్టానుసారంగా బండి నడిపితే కుదరదు



వాహనాల తనిఖీలో బీఎన్‌ఆర్‌పేట ఎస్ఐ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఇష్టానుసారంగా బండి నడిపితే ఇకపై కుదరదని బీఎన్‌ఆర్‌పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ అన్నారు. చిత్తూరు నగరం శెట్టిన్ తంగాల్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. లైసెన్స్‌పై ఆరా తీసి పలు సూచనలు చేశారు. లైసెన్స్ లేకుండా బండి నడపకూడదన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యే థామస్ భేటీ

చిత్తూరు కలెక్టరేట్: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే థామస్ కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గంగాధరనెల్లూరులోని పలు సమస్యలు, అభివృద్ధి పనులను కలెక్టర్‌తో చర్చించారు.

హెల్మెట్ లేని వారికి జరిమానా



వాహనాలకు జరిమానాలు విధిస్తున్న ఎస్ఐ నరేంద్రకుమార్

గుడిపాల: హెల్మెట్‌లు, లైసెన్స్‌లు లేని వాహనాలకు శుక్రవారం గుడిపాల ఎస్ఐ నరేంద్రకుమార్ జరిమానా విధించారు. మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారిలోని అనుపు వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా హెల్మెట్‌లు, లైసెన్స్‌లు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఇందులో సుమారుగా 25 వాహనాలకు పైగా జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

గుడిపాల: కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. తమిళనాడు లోని కాట్పాడి సమీపంలోని లత్తేరికి చెందిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం రాత్రి చిత్తూరు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వారిని కారు ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు వెంటనే గుడిపాల పోలీసులకు సమాచారం అందించారు. వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి పోలీసు వాహనంలోనే తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నగర అభివృద్ధికి కలిసి పనిచేద్దాం





సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద, పాల్గొన్న కార్పొరేటర్లు

- మునిసిపల్ కౌన్సిల్‌లో పాలకుల పిలుపు
- పలు పనులను ఆమోదం తెలిపిన కౌన్సిల్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని, అందరి సహకారంతో చిత్తూరు నగర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా ముందుకెళతామని మునిసిపల్ పాలకవర్గం పేర్కొంది. చిత్తూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నగర మేయర్ అముద అధ్యక్షతన జరిగింది. నగరపాలక కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఇటీవల ఎన్నికల్లో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల శాసనసభ్యులుగా గెలిచిన గురజాల జగన్ మోహన్, కలికిరి మురళీమోహన్ కార్పొరేషన్ ఎక్స్–అఫిషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

పలు అంశాలకు ఆమోదం

- ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ భవనాలను పునర్‌నిర్మించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా మార్చు చేయడానికి, రూ.1.38 కోట్ల నిధులను ఖర్చు చేయడానికి ఆమోదించారు. నగరంలోని అనువైన ప్రాంతాల్లోనూ ప్రజల సౌకర్యార్థం మార్కెట్లను, రైతు బజార్లను, మామిడికాయల మండీని అభివృద్ధి చేస్తామని పాలకులు పేర్కొన్నారు. నగరంలో ప్రతి ఇంటికీ నీటి సరఫరా చేసేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు.
- చిత్తూరులో అభివృద్ధి చేస్తున్న మార్కెట్లో కార్పొరేషన్ పరిసరాల్లోని మండలాల రైతులకు తగిన అవకాశం కల్పించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కోరారు.
- చిత్తూరు నగరపాలక సంస్థలోని మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బి.నాగకుమార్‌ను ఎమ్మెల్యే ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు.
- కార్పొరేషన్‌లోని ఏఎస్ఎం కాంప్లెక్స్, ఎమ్మెస్సార్ కాంప్లెక్స్, జైహింద్, గుర్రప్ప నాయుడు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించడానికి, నగరపాలక పరిధిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ మున్సిపల్ వర్కర్లకు రూ.1000 చొప్పున చెల్లించడానికి, సీఎంటీఎస్ రోడ్డు పక్కన గాండ్లపల్లిలోని నివాసానికి సంబంధించి మైత్రి నగర్‌గా గుర్తించి, మైత్రి నగర్ రోడ్డు 1,2,3,4,5 క్రాసులుగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడానికి, నగరపాలక సంస్థలో పనిచేస్తూ మరణించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది.
- ఈ సమావేశంలో కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏ అర్హతతో ఆమోదం?

పలు అంశాలను ఆమోదించడంపై డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికైన మేయర్, టీడీపీ కండువా కప్పుకుని సభలో అంశాలను ఆమోదించడం సభా మర్యాద కాదన్నారు. ఆమె తమ పార్టీ వీడిన వెంటనే సాధారణ కార్పొరేటర్ అని, వైఎస్సార్‌సీపీ సభ్యుల మద్దతు లేదన్నారు. దీనిపై కమిషనర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేయగా, ఆమె మిన్నకుండిపోయారు. టీడీపీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నగర అభివృద్ధికి అందరితో కలిసి తాము పనిచేస్తామని, వాళ్లు పార్టీలోకి వస్తే ఆహ్వానించామన్నారు. అయినా మేయర్ సభలో ఎలాంటి కండువా కప్పుకోలేదని, దీనిపై ఎదైనా అభ్యంతరాలు ఉంటే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల నుంచి సమాధానం తీసుకోవాలన్నారు. కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యేలకు వైఎస్సార్‌సీపీ తరఫున ఆ పార్టీ కార్పొరేటర్లు అభినందనలు తెలిపారు.

గర్భిణులు ఐరన్ మాత్రలు వాడాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు ఐరన్ మాత్రలు తప్పక వాడాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు వాడకంపై సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు రక్తహీనత రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని ఎగువ మత్యంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య

డ్రాపౌట్.. బడిబాట!



బడిలో చేరుతున్న మనస్విని

చిత్తూరు కలెక్టరేట్: బడి మానేసిన విద్యార్థినిని తిరిగి బడికి పంపించేలా సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. బంగారుపాళ్యం మండలం తుంపాయనపల్లెలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆ తనిఖీలో ఒకటవ తరగతి చదివే మనస్వి చాలా రోజులుగా పాఠశాలకు రావడం లేదని తెలుసుకున్నారు. ఆ విద్యార్థిని వివరాలు తెలుసుకున్న ఆయన తిన్నగా ఆ బాలిక ఇంటి వద్దకు వెళ్లారు. మనస్వి చదువు మాన్పించిన తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, తిరిగి బడికి పంపించేలా చర్యలు తీసుకున్నారు.

ఇంటి వద్దకే వైద్యం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని నంగమంగళం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్యసేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలత, శాంతకుమారి, యమున, వరలక్ష్మి, రూబి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ లక్ష్మి

బంగారుపాళెం: సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉండడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి అన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ బంగారుపాళెంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగు నీటి కాలువలు, గ్రామాల మధ్య ఉన్న చెత్త, పేడ దిబ్బలను తొలగించాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒక్కసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ కాకుండా మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలు జబ్బుల బారినపడకుండా ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. పారిశుధ్యపనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే గ్రామ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పలురికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు శంకరయ్య, అవంతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పెంపుడు కుక్కలకు టీకాలు

తవణంపల్లె: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి మండలంలోని పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. సుమారు 180 రకాల పైబడిన వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. ఈ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలను అప్రమత్తం చేసి వాటి బారిన పడకుండా చేయడమే ప్రపంచ జూనోసిస్ దినోత్సవ ఉద్దేశమన్నారు. పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి ప్రధానంగా రేబీస్, ఆంత్రాక్స్, బ్రుసుల్లోసిస్, క్షయవ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. రేబీస్ ప్రమాదరక, ప్రాణాంతకమైన వ్యాధి అని వివరించారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

గ్రామ సంఘాలతోనే సమాఖ్య అభివృద్ధి





మహిళా సంఘాల సమావేశంలో ప్రసంగిస్తున్న జయశేఖర్, హాజరైన మహిళా సంఘాల సభ్యులు

గుడిపాల: గ్రామైక్య మహిళా సంఘాలు అభివృద్ధి చెందితేనే మండల సమాఖ్య మరింత అభివృద్ధి చెందుతుందని సప్తగిరి గ్రామీణబ్యాంక్ మేనేజర్ ఫైనాన్షియల్ లెటర్స్ కౌన్సిలర్ జయశేఖర్, డీఆర్‌డీఏ డీపీఎం బ్యాంక్ లింకేజీ ఆఫీసర్ నాగేశ్వర్ రావు, వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని చిత్తపారలో ఉన్న మహిళా సంఘాలకు శుక్రవారం వార్షిక సమావేశంతోపాటు అక్షరాస్యత అవగాహన కార్యక్రమంపైన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను వాయిదాల్లో సకాలంలో చెల్లిస్తే వడ్డీలేని రుణాలు వస్తుందని చెప్పారు. తీసుకుంటున్న రుణాల గురించి మహిళలు వివరంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు యానిమేటర్లు, సీసీల ద్వారా వివరాలను తెలుసుకుంటూ ఉండాలన్నారు. అనంతరం ఈ సంవత్సరం వచ్చిన ఆదాయ వివరాలను చదివి వినిపించారు. చిత్తపార మహిళా సంఘాల్లో రూ.2,82,169,000 లాభంలో ఉందన్నారు. గ్రామ సమాఖ్య ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తంలో చూసుకుంటే రూ.11లక్షలు లాభాల్లో ఉందన్నారు. దీంతో పాటు చిన్నతరహా పరిశ్రమలను పెట్టుకోవడానికి డ్వాక్రా మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్రలు హాస్యలత తదితరులు పాల్గొన్నారు.

చిరు పెట్టుబడితో సిరులు!



- లాభదాయకంగా చిరుధాన్య పంటలు
- సాగుకు ఇదే మంచి తరుణం
- మార్కెట్‌లో పెరిగిన డిమాండ్
- మెట్ట భూముల్లో సైతం అధిక దిగుబడి
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

పడమటి మండలాల్లో వేరుశనగ సాగుపై అధికశాతం రైతులు ఆధారపడ్డారు. అయితే ఏటా వాతావరణం అనుకూలించక పెట్టుబడి కూడా రాకపోవడంతో దిగాలు పడుతున్నారు. ఈ తరుణంలో ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉండడంతో అన్నదాతలు ఆ దిశగా ఆసక్తిచూపుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఈ పంటల సాగుకు సమయమిదే అని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. చీడపీడల బెడదతోపాటు పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండడంతో అధిక ఆదాయం పొందవచ్చని వెల్లడిస్తున్నారు.

పలమనేరు: వర్షాధారంతో సాగు చేసే చిరుధాన్య పంటలపై రైతులు మక్కువ చూపుతున్నారు. పెద్దగా పెట్టుబడి పెట్టాల్సిన పనిలేకపోవడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమవుతున్నారు. తెగుళ్ల బెడద తక్కువగా ఉన్న కారణంగా పురుగు మందులు, ఎరువులకు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారులు సైతం చెబుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో చిరుధాన్య పంటల సాగుకు శ్రీకారం చుడితే లాభదాయకంగా ఉంటుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే మార్కెట్‌లో ప్రస్తుతం చిరుధాన్య ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని వెల్లడిస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని అన్నదాతలు ఆదాయ మార్గంలో పయనించాలని కోరుతున్నారు. ముఖ్యంగా వర్షాధారిత చిరు పంటలైన ఉలవ, రాగి, పెసర, మినుము, కంది, జొన్న, జనుము, పిల్లి పెసర, సజ్జ, కొర్ర, మినుము, సోయా చిక్కుడు, వాము, మొక్కజొన్న, దనియాలు సాగు చేయడం ఉత్తమమని తెలియజేస్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు ఈ పంటలను ఏటా సాగుచేస్తూ అధిక లాభాలను గడిస్తున్నారని వివరిస్తున్నారు.

కంది: సెప్టెంబర్ 15వ తేదీ నుంచి కందిని సాగు చేసుకోవచ్చు.ఎకరాకు ఆరు కిలోల విత్తనం సరిపోతుంది. నాలుగునెలల్లో పంట చేతికొస్తుంది. పొలం గట్లపై కూడా సాగు చేసుకోవచ్చు. ఎకరాకు 5నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం చేనులను బీడుగా ఉంచుకున్న రైతులు కందులు వేసుకోవచ్చు. సుమారు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు ఆదాయం పొందవచ్చు.

జొన్న: తెగుళ్ల సమస్యలేని పంట జొన్న. దీని సాగుకు ఇదే మంచి తరుణం. ఎకరానికి 40 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఖర్చులు మినహాయిస్తే రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చు. దీని ద్వారా పశువులు మేత కూడా దొరుకుతుంది. పశు సంవర్ధకశాఖ రాయితీతో విత్తనాలను సరఫరా చేస్తోంది.

మినుము: మార్కెట్‌లో మినుములకు మంచి గిరాకీ ఉంది. అక్టోబర్ నుంచి సాగు చేసుకోవచ్చు. పంటకాలం 80 రోజులు. ఎకరా సాగుచేస్తే 8 నుంచి పది క్వింటాళ్ల పంట దిగుబడి ఉంటుంది. తద్వారా రైతు రూ.90 వేల వరకు సంపాదించుకోవచ్చు. పశుగ్రాసంగా కూడా రైతులకు ఉపయోగపడుతుంది.

సోయా చిక్కుడు: వర్షాధారంగా నల్లరేగడి నేలల్లో సోయా చిక్కుడు సాగుచేసుకోవచ్చు. ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పస్తుతం క్వింటాల్ రూ.5వేల దాకా పలుకుతోంది. ఖర్చులు పోనూ రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చు. సన్న చిన్నకారు రైతులకు ఈ పంట సాగు ప్రయోజనకరం.



దనియాలు: ప్రస్తుతం దనియాల సాగు రైతులకు వరంలా మారింది. నీటి తడులతోనూ, వర్షాధారంగానూ దీన్ని సాగు చేయవచ్చు. కొత్తిమీరను సైతం మంచి ధర పలికితే అమ్ముకోవచ్చు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పంట ఖర్చులు పోనూ ఎకరాకి రూ.40 వేల వరకు ఆదాయం ఉంటుంది. పంట కేవలం 80 రోజులే కావడంతో రైతులకు ఎంతో మేలు.



కొర్రలు: ఖరీఫ్, రబీ రెండూ సీజన్‌లలోనూ సాగుచేసుకోవచ్చు. పంట కాలం కేవలం70 రోజులు మాత్రమే. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడిని పొందవచ్చు. ఖర్చులు పోనూ రైతుకు ఎకరానికి రూ.30 వేల వరకు ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం కొర్రలకు మంచి డిమాండ్ కూడా ఉంది.

వాము: భూమిలో తగినంత తేమను నిలుపుకొనే శక్తి కలిగి, సారవంతమైన భూముల్లో వర్షాధారంగా ఈ పంటను సాగుచేసుకోవచ్చు. సెప్టెంబర్ మొదటి వారంలో విత్తుకోవడానికి అనుకూలం. ఎకరానికి 4 నుంచి 6 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి ఉంటుంది. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.10 వేల వరకు ఉంది. దీంతో రూ.40 వేల ఆదాయం ఉంటుంది.

మొక్కజొన్న: తక్కువ పెట్టుబడితో ఎకరానికి రూ.20 వేల దాకా నికర ఆదాయం పొందవచ్చు. పంట కాలంలో కనీసం మూడు దఫాలు నీరు సరఫరా చేస్తే చాలు పంట చేతికొస్తుంది. ఎక్కువగా వర్షాధారంతో పంట సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. పశుగ్రాసం గానూ అదనపు ఆదాయం వస్తుంది.

పెసర: చౌడు నేలల మినహా మిగిలిన ఏనేలల్లోనైనా దీన్ని విత్తుకోవచ్చు. సెప్టంబరు మొదటి వారం నుంచి విత్తుకోవచ్చు. వెదజల్లితే ఎకరానికి ఏడుకిలోల విత్తనాలు అవసరం. మంచి యాజమాన్య పద్ధతులతో ఎకరానికి ఆరు క్వింటాళ్ళు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ధర క్వింటాళు రూ.5వేల దాకా ఉంది.

సజ్జలు: నీరు నిలవని అన్నిరకాల నేలలు దీని సాగుకు అనుకూలం. 70 నుంచి 90 రోజులు పంట కాలం. ఎకరానికి రెండు కిలోల విత్తనం అవసరం. సజ్జ పంటలో ప్రధాన కంకి మొదట కోతకు వస్తుంది. ఆపై పిలక కంకులను మూడు, నాలుగు దశల్లో కోయాలి. కోసిన కంకులను ఆరబెట్టి నూర్పిడి చేసుకోవాలి. సజ్జకు ఇప్పుడు మంచి గిరాకీ ఉంది.

కచ్చితంగా నష్టాలు రావు



చిరుధాన్యాలైన ఉలవ, కంది, జొన్న, అనప, తదితర పంటలు సాగు చేసుకుంటే రైతులకు కచ్చితంగా నష్టాలు రావు. వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఖరీఫ్ నుంచి అదును చూసి చిరుధాన్యాలను సాగుచేకోవడం ద్వారా రైతులు నికరమైన ఆదాయం పొందవచ్చు. అన్నదాతలకు ఆర్థికంగా వెసులుబాటు వస్తుంది. చిరుధాన్యాలతో తయారైన ఆహారంపై ప్రజలు సైతం ఆసక్తి చూపుతున్నారు. –అన్నపూర్ణాదేవి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పలమనేరు

అదనపు ఆదాయం



వేరుశనగ సాగుకు రైతులు ఎకరాకు రూ.10వేల నుంచి 15 వేల దాకా పెట్టుబడిగా పెట్టాలి. అయితే వర్షాలు కురిసి మంచి దిగుబడి వస్తే సరే లేకుంటే నష్టం వస్తుంది. అందుకే వేరుశనగ పొలంలోనే ఉలవను సైతం జల్లుకోవచ్చు. ఇది పూర్తిగా వర్షాధారమే. వేరుశనగ ఒబ్బిడి చేసుకున్నాక ఇది చేతికొస్తుంది.దీని ద్వారా ఎకరాకు రూ.10వేల దాకా అదనపు ఆదాయం పొందవచ్చు. చిరుధాన్యాలతో రైతులకు నష్టాలు రావు. –సంధ్య, ఏఓ, పలమనేరు

రాగులు: రైతులకు రాజపంటగా పేరుగాంచిన రాగులుతో రైతుకు ఎప్పుడూ నష్టం రాదు. రబీ సీజన్‌లో అయితే నవంబర్ నుంచి సాగు చేసుకోవచ్చు. వకుళ అనే రకం మంచి దిగుబడులనిస్తోంది. కేవలం వందరోజుల్లోనే పంట చేతికొస్తుంది. ఎకరాకు 13 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నారు పోసుకోవడానికి రెండున్నర కిలోల విత్తనం చాలు. వెదజల్లితే ఎకరానికి నాలుగు కిలోల అవసరముంది. క్వింటాల్ ధర రూ.3వేల దాకా ఉంది. ఎకరానికి రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చు.



ఉలవలు: వర్షాభావ పరిస్థితుల్లో ఈ ప్రాంతానికి మిక్కిలి అనుకూలమైన పంట. సెప్టెంబర్ నుంచి అక్టోబర్ దాకా విత్తుకోవచ్చు. నాట్లు ద్వారా అయితే ఎకరానికి పది కిలోల విత్తనాలు అవసరం. వెదజల్లే పద్ధతిలో 16 కిలోలు అవసరం. పంట దిగుబడి బాగా ఉంటే ఎకరానికి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.3వేల దాకా ఉంది. పశువులకు మేతగానూ ఉపయోగ పడుతుంది.



జనుము: పండ్ల తోటలు గల రైతులు ఈ వర్షాకాలంలో జనుము, పిల్లి పెసర విత్తనాలను చెట్ల మధ్యల్లో చల్లుకోవాలి. దీని ద్వారా పశువులకు దాణా దొరుకుతుంది. పశుగ్రాసం విక్రయించుకున్నా ఎకరానికి రూ.16 వేల వరకు ఆదాయం వస్తుంది. లేదా కలియదున్నితే భూమిలో సేంద్రీయ కర్బణం పెరిగి పొలం సారవంతంగా మారుతుంది.

